# ప్రియబాంధవి

జి. పార్వతి

కథానిక

పిన్ని నన్ను నరసాపురంనుంచి తెచ్చేసరికి నాకు పన్నెండు పదమూడేళ్లకంటె ఎక్కువలేవను కుంటాను. నాన్న నన్నుపక్కకి పిల్చి వెండిరూపాయి చేతిలో పెట్టారు. తలెత్తి చూసే సరికి నాన్న కళ్ళుబాధతో ఎఱ్ఱబడ్డాయి. అప్పటి కప్పుడే నాల్గేళ్ళనుంచి నాన్నదగ్గిరా రెండో అమ్మదగ్గర అలవాటుపడ్డాను. పిన్ని నాల్గు రోజులుందామని వచ్చింది. తనకి చంటి పిల్లాడు, ఎడ పిల్లతో పని సాగటంలేదని నన్ను తీసికెడతానని అంది. నాన్న ముందు పంప నన్నారుగాని, రెండో అమ్మ ఒప్పించింది.

"అమ్మ అన్న మాటలు మర్చిపోసుబ్బులూ నీకు సుఖం కల్గాలని వెంకటేశ్వరస్వామిని వేడుకుంటాను. నీ నాన్న వట్టి దరిద్రుడు. ఒక రూపాయన్నా యివ్వలేడు. ఆనక నేను పదిరూపాయలు కూడేసి అమ్మకి తెలీకుండా నీకు పంపుతాను. పిన్ని చాలా మంచిదేలే. పోయిన అమ్మా, పిన్ని చాలా ప్రేమగా వుండే వారు. అందుకే నువ్వంటే యిష్టం!"

నేను పిన్నిగారి ఊరు చేరేసరికి సాయంత్రం దాటింది. పిన్ని కుఱ్ఱదాన్ని పంపించి హొటా ల్నుంచి కాఫీ తెప్పించింది. బాబాయి పెద్ద ఆయుర్వేదవైద్యుడు. మొదట్లో పిన్నిని సరిగా చూసేవారుకారు. పిన్ని చాలా బాధలుపడింది. విధవ ఆడపడుచూ అత్తగారూ కలిసి రెండు వేళలా వంట, యింటిపని చేయించేవారు. బాబాయి కచేరిగది ఎదురుగుండా చాప పర్చు కుని భారతం చదువుతూ కూర్చునే వారు. పిన్ని యింతపని చేసినా రాత్రి బాబాయి ఏదో తప్పు చెప్పి రక్తం కారేటట్టు కొట్టేవాడు. సుబ్బులుకి పిన్నినిచూస్తే ఎంతో జాలేస్తుంది! తనుమటుకు, ఏం సుఖపడ్తుందా!....

"కాఫీ తీసుకోవే సుబ్బులూ! మీ బాబాయి రెండురోజులకొకమారు వూరువెడ్తూంటారు. నాకు యీమేడలో ఎంతో భయమేస్తుంది. అందుకు నిన్ను తెచ్చాను...." అని నవ్వింది. నేను వులిక్కిపడి చూశాను. పిన్ని గదులన్నీ తన చేతులతోనే సర్ది పెట్టింది. ఈ లోపున నేను వంటకి అన్నీ సిద్ధంచేస్తున్నాను.

"అమ్మాయ్ సుబ్బులూ....నువ్వు కాసేపు యిలా కూర్చుని వెళ్ళవే....పెద్దదాన్ని నాకే ఒళ్లు అలసటగా వుంది. నీచేత చేయించి ఆ నాల్గుమెతుకులు ఏం సంతోషంగా తినాలి!" అంది. నేను చేతులు పరికిణీకి తుడుచుకుంటూ పిన్నిదగ్గరకెళ్ళి నుంచున్నాను. పిన్ని నన్ను చూసి గట్టిగా నవ్వటం మొదలెట్టింది. నేను కంగారు పడ్డాను.

"ఏం పిన్నీ!....అలా నవ్వుతున్నావ్?" అని అడిగాను.

"నీ రూపు చూస్తే నవ్వు పుట్టుకొస్తోందే. ఆ చిరిగిన పరికణీ అతుకుల జాకెట్టు....కాళ్లకు వెండి కడియాలు...."

"మా అమ్మ యీ కడియాలు తీయొద్దని చెప్పింది. నేను వద్దని గోలపెట్టాను పిన్నీ..." అన్నాను.

"అదేమంత కష్టం కాదులే. రేపు స్థిమిత పడ్డాక తీయించేస్తాను. నువ్వు ఆ చిరుగు పరికిణీ విప్పి మరీ అవతలి కెళ్ళు" అంది పిన్ని.

"నాకు యింకో పరికిణీ లేదు పిన్నీ! అన్నీ మాసిపోయాయి" అని నవ్వుకుంటూ అవతలి కెళ్ళాను. నా గుండె వేగంగా కొట్టుకుంది. నా బట్టలు నేను చూసుకుని ఎంతో బాధపడ్డాను. గోడకి ఆనుకుని ఎంతోసేపు ఏడ్చాను. క్రింద కిల్లీకొట్టువాడు పిన్నిని చూసిపోదామని మెట్ల మీదకు వచ్చాడు. నేను అతన్ని అదే మొదటి సారిగా చూశాను. లేచి పక్కకి నుంచున్నాను.

''ఎవరి బుల్లివమ్మా!.... నువ్వు అవపడ లేదు ఎప్పుడూ!" అన్నాడు మెల్లగా.

పిన్ని అతని గొంతు ఆనవాలుపట్టి యివ తలికొచ్చి చూసింది. నేను సిగ్గుతో తల దించు కున్నాను. ''అదేమే సుబ్బులూ!....నువ్వు ఎక్కడా కన్పించకపోతే కింద ఆడుకుంటున్నా వనుకున్నాను. పిచ్చి పిల్లా!....రా లోపలికి.'' అని నన్ను దగ్గరగా లాక్కుని తీసికెళ్ళింది. నాకు యింక ఏడ్పు ఆగలేదు. అదంతా యీ తాత్కాలిక సుఖంవల్ల వచ్చిన ఆనందమన్న మాట. పిన్ని మంచినీళ్ళు తెచ్చి యిచ్చింది.

''వెర్రి పిల్ల!....ఎందుకే అలాగున బాధ పడ్డావ్!....యీ మంచినీళ్ళు తాగు. జడవేస్తా నులే.'' అంది. యింతసేపు కిల్లీకొట్టు కోటయ్య ఆలాగే ఆశ్చర్యంగా నిలుచున్నాడు.

"మా అక్కయ్య కూతురు సుబ్బులు, కోటయ్యా! తల్లి లేదు....మారుడు తల్లి. దాని బాధలు చూడలేక వాళ్లనాన్ననడిగి తెచ్చాను. మా అక్కయ్య ఎంత మంచిదో చెప్పలేను...'' అని అంది రుద్ధకంఠంతో.

''అమ్మాయిగారు చిన్నోరండి. పోనీ మీరైనా కాపాడండమ్మా....యివాళ యీ మంచి పనికి మరొకప్పుడు దేముడు మిమ్మల్ని కనిపెడతా డండి....'' అన్నాడు.

నేను సాయంత్రం కిందకి దిగాను, నా తోటి పిల్లలతో ఆడుకునేందుకు. నాకు అంకెలు లెఖ్ఖ పెట్టటం, అక్షరాలు రాయటం రాదు. వాళ్లంతా తాడుతో గెంతి ఆడ్తోంటే నేను చూస్తూ నుంచున్నా. "సుబ్బులుకి చదవను, రాయను రాదుట....యింతపెద్దది యింక స్కూలుకేం పోతుంది!....'' అంది ఒకపిల్ల. అక్కడ నేను నిలబడలేకపోయాను. పిన్ని, బాబాయికి పెట్టెలో బట్టలు సర్దుతోంది.

బాబాయి తొందరగా భోజనం చేస్తున్నారు. "బాబాయికి కాస్త నెయ్యి వేయవే సుబ్బులూ.'' అంది పిన్ని. నేను గిన్నె చేతబట్టుకుని ఒంగు న్నాను. చెయ్యిజారి నెయ్యి చిలికింది. బాబాయి కొత్తపంచె పాడయింది. పిన్ని అలాగే నుంచుండి పోయింది.

''ఈ పిల్లని ఒకర్తిని తెచ్చావు నెత్తిమీదకి. అంత ప్రేమ వుంటే నీ నెత్తిన ఎక్కించుకో. ఏమే పిల్లా....నువ్వు యివాల్టినుంచి నా ఎదురుగా కనపడొద్దు.'' అని కోపంగా లేచారు. పిన్ని కాళ్ళు పట్టుకుని బ్రతిమిలాడింది.

''ఏదో తెలీనితనం....మీకు తమలపాకులు రాద్దామని. దానిచేత వడ్డింపించాను. మీరు తిని వెళ్ళకపోతే నా మీద ఒట్టు....''అంది ఏడుస్తూ. బాబాయి మాట విన్పించుకోకుండగా కండువా బుజంమీద వేసుకుని బండి ఎక్కారు. అలాగే గోడకానుకుని ఏడుస్తూ నుంచుంది పిన్ని. నేను పక్కగా వెళ్ళి పిన్ని చెయ్యిప ట్టు కుని బ్రతిమాలాను ''నన్ను పింపించెయ్యి పిన్నీ నాన్నదగ్గరకే పోతాను. నావల్ల నీకు ఎంత కష్టం వచ్చిందో!....'' అన్నాను. పిన్ని నన్ను గట్టిగా కౌగిలించుకుని ఒణుకుతున్న పెదవు లతో అంది.

''ఇలా ఎన్నిసార్లు జరిగింది సుబ్బులూ.... నువ్వు యిలాటి పరిస్థితుల్లో నన్ను ఓదారుస్తా వనే తెచ్చాను. ఆయన మగమహారాజు. నాకు యీ కష్టాలు అనుభవించమనే రాసివుంది.'' అంది.

నేను రోజూ పిన్నిదగ్గర కూర్చుని చదువు నేర్చుకుంటున్నాను. పిన్నికి నేనంటే పంచ ప్రాణాలు. ఆ మమకారం ఎందుకో మటుకు తెలీదు. నేను ఎన్నిసార్లు నూనె, వొలక పోశాను! ఎప్పుడూ పిన్ని పల్లెత్తు మాటయినా అనేదికాదు. నిన్న కొబ్బరినూనె సీసా జారి కింద పడింది. సీసా బద్దలవకపోయినా, నూనంతా వొలికింది.

''పోవే పిచ్చిపిల్లా! .... ఎప్పుడూ ఒలక పోస్తావు. నీ చేతులు అవుకుగా వున్నటు

న్నాయి. నీ అత్తగారు ఎన్నిసార్లు రుద్రావతారం దాల్చాలో నీకోసం!'' అని నవ్వేది. ఆ, అదే ఆ నవ్వే నేను ఆశించేది. నేను నేరస్తురాల్నయి వుండగా అంత విలువైన నవ్వు చూస్తే నాకు ఏదో ఆనందం పొంగుకొని వచ్చేది. ఇవాళ నాకు ఏదో కోరిక మొలకెత్తింది. పిన్ని నన్ను కోప్పడితే నాకు వినాలని వుంది....''నన్ను ఒక్కసారి కోప్పడు పిన్ని....నాకు వినాలని వుంది'' అన్నాను నవ్వుతూ.

''నీ మొహం, ఆ పెద్ద కళ్లు చూస్తుంటే నాకు కోపం జ్ఞాపకం రాదు సుబ్బులూ'' అంది పిన్ని.

"మరయితే అందరూ వాళ్ల పిల్లల్ని కేక లేస్తారు?''

''పిల్లల్ని ఎలా పెంచాలో తెలీక. విలువ తెలుసుకోవటానికి కూడా కొంత విలువ వాళ్లలో కల్గివుండాలి సుబ్బులూ" అంది నవ్వుతూ.

ఇవాళ పిన్ని కొంత చికాకుగా వుంది. వంట నేనే చేశాను. తను బొత్తిగా యిటు కూడా తిరిగి చూడలేదు. నేను తలదగ్గర కూర్చుని తలపట్టుతున్నాను. పిన్ని నా వైపు తిరిగి నా చేతులు తీసి తన గుండెమీద పెట్టు కుంది.

''నా బాధంతా యిక్కడే దాచుకోవాలి సుబ్బులూ....దాచుకోలేక నానావ్యవదా పడ్తు న్నాను....'' అంది. నా కంట్లోకూడా నీరు తిరిగింది. నా వయసుకు నాకు పిన్ని కేవలం తలనొప్పితోనే బాధపడ్తుందనే కాని, అంతకన్నా పెద్ద ఆలోచనలు తట్టవు. బాబాయి నాల్గు రోజులుగా రాలేదు. పిన్ని బజారు సామాన్లు అవీ కోటయ్యచేతే తెప్పించింది. కోటయ్య మటుకు ఎంత మంచివాడు!....కాని వాడి వంకర తిప్పిన మీసాలు చూస్తేమటుకు భయం పుడ్తుంది. పెద్ద గొంతుక. ఒక్క మాట మాట్లా డితే యిల్లంతా ప్రతిధ్వనిస్తుంది.

''అమ్మా!....నేనివాళ సొప్పింది మీరు మన సులో పెట్టుకోకండి అమ్మా. మన లోకం అంతా వేరండి. అంతా ఆ పరమాత్ముడే కాస్తాడు..'' అన్నాడు. పిన్ని యీ మాట వినికూడా జవాబు చెప్పలేకపోయింది.

''ఏమిటి పిన్నీ కోటయ్య చెప్తున్నాడు!...'' అన్నా మెల్లగా. యిప్పుడు పిన్ని నాకు చాలా ఆంతరంగికురాలయింది.

''నీకు యిలాటి విషయాలు తెలియటానికి యింకా పెద్దదానివి కావాలి....'' అంది పిన్ని.

''బాబాయి యింకా రానేలేదు. ఎన్నాళ్లలో వస్తారు పిన్నీ?'' అని అడిగాను.

''ఆయన యింక రానేరారు. ఎందుకోసమని వస్తారు సుబ్బులూ ఆయన!....ఆయన ప్రపం చకంవేరు, నిన్న కోటయ్య చేతికి మనకిమ్మని కొంత డబ్బు యిచ్చారుట. ఎప్పుడొస్తారో తెలీదు,'' అంది బాధగా.

"అంత తీరిక లేకుండావుందా పిన్నీ!.... మరి నువ్వుచూస్తే యిలావున్నావు.'' అన్నాను ఏడుస్తూ.

పిన్ని బొత్తిగా అన్నం తినటంకూడా మానే సింది. ఏదో ఎప్పుడూ ఆలోచిస్తూంటుంది. రాత్రి నాన్న వచ్చారు. పిన్ని ఏదో అరగంటకు పైగా రహస్యంగా మాట్లాడింది. నేను పిన్నిని మాత్రం వదిలి వెళ్ళలేను. ఎంత అలవాట యింది పిన్ని నాకు!....చిన్నప్పుడు పిన్నికి అమ్మ ఏన్నో చేసేదిట. జ్వరమొస్తే పిన్నితో పాటు తనూ పస్తుపడుకునేదిట. పిన్ని అత్తవా రింట్లో పడ్డ బాధలు విని అమ్మ తల గోడనేసి కొట్టుకుని ఏడ్చేది. ''ఇంక దానికి సుఖంలేదు. అది అలాగే నశించాలి గాబోలు. నేను దగ్గర పెట్టుకుని నా చెల్లెల్ని నెత్తిన పెట్టుకుని చూస్తాను.'' అందిట. పిన్ని నాల్గురోజులుండి ఎంతసుఖమో పొందింది. అప్పుడే నిర్ణయించు కుంది అమ్మకి ఎప్పుడో కష్టం వస్తుంది, అప్పుడు తను సాయపడాలని.

నాన్న నాకు పదిహేను రూపాయలిచ్చి వెళ్ళారు. పిన్ని తన పిల్లలకీ నాకూ కలిపి ప్రయివేటు మేష్టరుగార్ని పెట్టింది. బాబాయి యిప్పుడు యింట్లోనే ఉంటున్నారు. రాత్రి యిద్దరూ తగవులాడారు. కాని, తనకి ఒక మాటా అర్థంకాలేదు. ఒక్కసారి ఏ పాతికేళ్ళ దాన్నో కావాలనుకున్నాను. వెంటనే నవ్వు వచ్చింది. ఇంకా ఎన్నేళ్ళు యిలా గడవాలో!

బాబాయి, పిన్నీ దెబ్బలాడుకున్న దగ్గ ర్నుంచీ, ఆయన మారారు. రెండువేళలా భోజ నానికి వస్తున్నారు. పిన్నికూడా సంతోషంగానే వుంటోంది. నేను మాత్రం ఆయన కంట పడను. నన్ను తిడతారేమోనని ప్రతిక్షణ భయం. మేమంతా కలిసి ఆ రోజు వూళ్ళో కెళ్ళాము. నేను వూరొచ్చి యిదే యిల్లు కద లటం. నాకు రాయను, చదవను వచ్చుగా!.... ప్రతి బోర్డు చూసి చదవటం ఒక సరదా. మధ్యమధ్య పిన్ని తనకి తెలుసున్న మను ష్యుల్ని చూపెట్టి ఏదో చెప్పేది. బాబాయి మమ్మల్ని హెూటల్లో కూర్చోపెట్టి బయటికి వెళ్ళారు. అరగంట దాటినా రానేలేదు.

''సుబ్బులూ! బాబాయి అలా వెళ్లినట్టు న్నారు. కనిపిస్తే పిలుచుకుని రావే!'' అంది పిన్ని. నేను వరండామీదికి వచ్చి చూశాను. బాబాయి ఎదురు దుకాణంలో నుంచుని ఎవరో ఆడమనిషితో మాట్లాడుతున్నారు. నా గుండె కొట్టుకుంది. నేను చూసేది బాబాయి నవునో కాదో తెలీలేదు. ఇంతలో పిన్ని వెనకాలకి వచ్చి నుంచుంది.

''ఏరే బాబాయి?'' అంది.

''అదుగో అక్కడ వున్నట్టున్నారు పిన్నీ!'' అన్నాను వేలుపెట్టి చూపెడుతూ. పిన్ని నన్ను చెయి పట్టుకుని లోపలికి తీసికెళ్ళిపోయింది. ఇంతలో బాబాయి వచ్చారు. పిన్ని ఏమాత్రం బాధ, ఈర్ష వ్యక్తపరచలేదు. నాకుమటుకు భయంతో ఎంతో దాహం వేసింది. పిన్ని బాబాయ్‌ని చూసి కూడా ఎందుకు అరవలేదు?

''నిన్ను పంపించేస్తానే సుబ్బులూ మీ నాన్నదగ్గరకి. నువ్వు పెద్దదానివయి ఎంతో సుఖపడాలని దేవుడికి కోరుకుంటున్నాను....'' అంది.

''నేను వెళ్లను పిన్నీ! నీదగ్గరే వుంటాను'' అన్నాను నెమ్మదిగా.

''లేదు, వెళ్లితీరాలి. ఇప్పుడు వెళ్ళకపోతే తరవాత కష్టమౌతుంది'' అంది. నాకు అం దులో అర్థం తెలీలేదు.

మర్నాడు నన్ను తనకి తెలుసున్నవాళ్ళ చేత పంపించింది. నేను వెళ్ళిన వారానికల్లా నాన్నకి పిన్నిదగ్గర్నుంచి జాబు వచ్చింది. నేనూ విప్పి చదివాను. నా తలలో వంద రైళ్లు పరిగెత్తినట్టయింది. పిన్ని నవ్వుతూనే వుంది నా మనసుకి. ఆ నవ్వులో ఎన్ని విషాద ఘట్టాలు యిమిడివున్నాయో! ★

---

## (29వ పేజీ తరువాయి)

రోషోత్సేకం కారణంగా నేమో, ఆ మాట పైకి వెలువడింది గోవిందులోంచి.

నేనేమీ అనలేదు.

దానం చేసింది చాలక, వాడినుంచి ప్రతి ఫలంగా తిట్లు పొందాల్సి వచ్చిందని గోవిందు బాధపడి ఉంటాడు. ఇద్దరమూ ఒక మారు చేతుల్లో పట్టుకున్న పత్రికల కేసీ, ఒకమారు మా ప్రవర్తనని గర్హించి వెళ్ళిపోయిన బికారి వాడికేసీ చూడసాగాం.

బికారీ వాడు అందరి ముందటా చేయి చాస్తూ వెళ్లిపోయాడు. ఎవరూ ''ఇంద'' అన్న పాపాన పోలేదు.

గర్విష్ఠి వెధవకి శాస్తి బాగా జరుగుతూందని లోపల్లోపల మేం తృప్తిపడుతున్న సమయంలో వాడు బటానీల అబ్బాయిని సమీపించాడు. అర్థణాతో బటానీలు కొన్నాడు. బటానీగింజల నొక్కొక్కదాన్నే నోట్లోవేసుకుని నములుతూ తిరిగీ మా ముందు నించి వెళ్ళిపోయాడు.

గోవిందుకు గర్వభంగం జరిగిఉంటుంది. గొప్ప ఆశయాలు కలవాడు కనుక. తనిచ్చిన అర్థణాల్లాంటివి ఇంకా కొన్ని యాచించుకుని ఆనాడు వాడు కడుపునిండా భోంచేయ వచ్చు ననుకొని ఉంటాడు. కాని దాన్నివాడేలా ఉపయోగించాడో చూస్తే అతని గుండె ముక్కలయ ఉంటుంది. అంత కంటే ఎక్కు వగా ఒక బికారి కొనగలిగిన బటానీలని తాను కొనలేక పోయాడే అన్న ఆశ్చర్యంలో మునిగి పోయి ఉంటాడు. ★